కథ

# సారీ మాస్టారు!

**పగలంతా అలసిసొలసిన జగతి విశ్రాంతికోసం నిశాకాంత ఒడిని చేరడానికి వేగిరపడుతున్న వేళ...**

విశ్వనాథం మాస్టారు స్నానం చేసి, సంధ్య వార్చుకుని ఇంటి అరుగుమీద నులకమంచం వాల్చుకుని కూర్చుని ఆదారిన పోయేవారిని ఆప్యాయంగా పలకరిస్తున్నారు. అరవయ్యో పడి మధ్యస్థంలో ఉన్న మాస్టారు ఓ మిడిల్ స్కూల్లో హెడ్మాస్టారుగా రిటైరయి అయిదేళ్లయింది. రాజకీయాల ఒరవడిలో ఆటుపోటులకు కొట్టుకుపోయి ఎక్కడెక్కడో సర్వీసు చేసి చివరికి ఆ గ్రామానికి వచ్చి స్థిరపడ్డారు. ప్రభుత్వంవారు ముప్పుతిప్పలు పెట్టి ఇచ్చిన రిటైర్మెంట్ బెనిఫిట్స్ చేతికందగానే నీడకోసం ఆ చిన్నగూడును అమర్చుకున్నారు. చేతికందిన కొడుకు పిలుపు కందనంత దూరంలో ఉద్యోగం చేస్తున్న కారణంగా భార్య, తాను మాత్రమే వుంటున్నారక్కడ.

"వంటయిపోయింది...వడ్డించమంటారా?" అంటూ లోపలినుంచే అరిచింది మాస్టారి సతీమణి.

"ఆఁ, వడ్డించెయ్" అని జవాబిచ్చా రాయన.

భోం చేద్దామని లేచి లోపలికి వెళ్లబోతుంటే, "నమస్కారం, మాస్టారూ!" అన్న పిలుపు వినిపించి ఆగిపోయారు.

గుమ్మంలో ఓ యువకుడు చేతులు జోడిస్తూ.

"ఎవరు, బాబూ, నువ్వు?" అనడిగాడు మాస్టారు.

"నన్ను గుర్తుపట్టలేదా, మాస్టారూ? నేను...ప్రసాద్‌ని..." అన్నాడు ఆ యువకుడు.

కాస్త ముందుకు వంగి పరీక్షగా అతని ముఖంలోకి చూశారు మాస్టారు.

వంకీల జుత్తుతో సన్నగా, పొడవుగా ఉన్నాడు ఆ అబ్బాయి. ముప్ఫయ్యేళ్లుంటాయి. చంకను ట్రావెల్ బ్యాగ్ వేలాడుతోంది.

అతనెవరో జ్ఞప్తికి రాలేదు మాస్టారికి. అదే విషయం చెప్పారు.

"అది సహజమే, మాస్టారూ! మీ చేతితో వేలమందికి అక్షరాభ్యాసం చేసుంటారు. విద్యాబుద్ధులు గరపి ఉంటారు. ఎందరినని పేరుపేరునా గుర్తుపెట్టుకోగలరు మీరు? అది సంభవమైన పనేనా?" అన్నాడు ఆ యువకుడు. మళ్లీ అతనే-"కాని, మాస్టారూ, మీ నుంచి విద్యాదానం పొందిన నాబోటి విద్యార్థులు గురువులైన మిమ్మల్ని ఎలా మరిచిపోగలరు? అది సాధ్యమేనా చెప్పండి, మాస్టారూ!"

అతని మాటలను బట్టి అతను తన పాత విద్యార్థి అని గ్రహించాడు మాస్టారు.

"వయసు పైబడేకొద్దీ జ్ఞాపకశక్తి లోపిస్తోంది. అందుకే నిన్ను గుర్తుపట్టలేకపోయాను. ఏమనుకోకు బాబూ!" అన్నారు బాధపడుతూ.

"పరవాలేదు, మాస్టారూ! అయినా ఎప్పుడో ఎలిమెంటరీ స్కూల్లో మీ దగ్గర చదువుకున్నాను. ఇన్నేళ్ల తరువాత మీకు గుర్తురావడం కష్టమే" అన్నా డతడు.


"నిలుచునే ఉన్నావ్...వచ్చి కూర్చో."

నులక మంచంమీద కూర్చున్నా డతను. కొద్ది ఎడంగా మాస్టారూ కూర్చున్నారు.

"మంచినీళ్లు తీసుకుంటావా, బాబూ?"' అని మాస్టారు అడగడంతో-

"తప్పకుండా, మాస్టారూ! అమ్మగారి చేత్తో మంచినీ రిచ్చినా తులసితీర్థమవుతుంది" అని జవాబిచ్చా డతను.

అది విన్న మాస్టారి భార్య పెద్ద గ్లాసుతో మంచినీళ్లు పట్టుకొచ్చింది.



## సుభాస్ చంద్రబోస్ కోసం వేట!

దర్శకనిర్మాత శ్యామ్ బెనెగల్, చాలా కాలంగా 'సుభాస్ చంద్రబోస్' చిత్రాన్ని నిర్మించాలనుకుంటున్నాడు. కానీ టైటిల్ పాత్రకు తగిన 'మొహం' దొరకటం లేదంటున్నాడు. ముందా పాత్రకు పరేశ్ రావల్‌ను తీసుకుందామనుకున్నాడు కానీ, తరువాత వద్దనుకున్నాడు. ఆశుతోష్ రాణా, అనుపమ్‌ఖేర్, మనోజ్‌బాజ్‌పాయి, తదితరులను అనుకున్నాడు కానీ, ఏదీ నిర్ణయం కాలేదు. ఇంతకూ ఆ పాత్ర ఎవరిని వరిస్తుందో?

ఎస్.



“నమస్కారం, అమ్మగారూ! నా పేరు ప్రసాద్. బహుశా మీకు గుర్తుండి ఉండదు. నేను రాజోలులో మాస్టారి దగ్గర చదువుకునేప్పుడు మీ ఇంటికి వస్తుండేవాణ్ణి” అన్నా డతను గ్లానందుకుంటూ.

“అది చిన్నప్పటి మాట. ఇప్పుడు బాగా పెద్దవాడి వయిపోయావు. బాగున్నావా, నాయనా?” అని పరామర్శించిం దావిడ.

మంచినీళ్లు గటగటా తాగేసి గ్లాసు పక్కన పెడుతూ అన్నాడు ప్రసాద్–“పనుండి ఈ పక్కవూరి కొచ్చానమ్మా! మాస్టారు ఈ ఊళ్లో ఉన్నారని తెలిశాక చూడకుండా వెళ్లబుద్ధి కాలేదు.”

“నీ అభిమానానికి సంతోషం, నాయనా!” అనేసి ఖాళీ గ్లాసు తీసుకుని లోపలికి వెళ్లిపోయిం దావిడ.

“ఊ....ఇప్పుడు చెప్పు, ప్రసాద్, ఏం చేస్తున్నావ్ నువ్వు? ఏదైనా ఉద్యోగమా లేక బిజినెస్సా?” అనడిగారు మాస్టారు.

“కాకినాడలో స్టేట్ బ్యాంక్‌లో ఆఫీసర్‌గా పనిచేస్తున్నాను, మాస్టారూ! మీరు పెట్టిన విద్యాభిక్ష, విజ్ఞానం ఓదారి చూపించాయి. అందుకే మీ రెప్పుడూ నాకు గుర్తుండిపోతారు” అన్నాడు.

“ఇందులో నా దేముందోయ్! కష్టపడి ప్రయోజకుడి వయ్యావ్. అది నీ సామర్థ్యం! నా శిష్యుడు ఆఫీస రయ్యాడంటే నాకెంతో సంతోషంగా ఉంది” అన్నారు మాస్టారు ఆనందంతో. “పెళ్లయిందా?”

“అయింది, మాస్టారూ! ఓ పాప కూడాను.”

కాసేపు కష్టసుఖాలు ముచ్చటించుకున్నాక, “మీ రిక్కడ వున్నారని తెలీగానే మిమ్మల్ని చూడకుండా ఉండలేకపోయాను, మాస్టారూ! నెక్స్ట్ బస్సులోనే పరుగెత్తుకొచ్చేశాను. కాకినాడ వచ్చినప్పుడు అమ్మగార్ని తీసుకురండి...ఇక వెళ్లొస్తాను” అంటూ లేచాడు ప్రసాద్.

“అదేమిటోయ్, అంత ప్రయాసపడి ఈ మాస్టారిని వెతుక్కుంటూ వచ్చినవాడివి, భోంచేయకుండా ఎలా వెళదా మనుకున్నావ్?” అంటూ అభ్యంతరం చెప్పారు మాస్టారు.

“పరవాలేదు, మాస్టారూ! మరోసారి వచ్చినప్పుడు భోంచేస్తాల్లెండి” అన్నాడు ప్రసాద్ మొహమాటంగా.

“అదేం మాట, నాయనా, ఈవేళప్పుడు ఎక్కడికి వెళదామనీ? భోంచేసి ఈరాత్రికి ఉండిపో. తెల్లవారాక ఫస్టు బస్సులో వెళుదువుగాని” అని మాస్టారి సతీమణి కూడా బలవంతం చేయడంతో ఒప్పుకోక తప్పలే దతనికి.

000

మూణ్ణెల్ల తరువాత ఏదో పనిమీద కోటిపల్లి వెళ్లిన విశ్వనాథం మాస్టారికి ఆయన మిత్రుడు, ఒకప్పటి సహోద్యోగి అయిన రామారావు మాస్టారు కనిపించారు.

“మన పరంధామయ్య ఇప్పుడు ద్రాక్షారామంలోనే ఉంటున్నాడు...నీకు తెలుసా?” అని విశ్వనాథంని అడిగారు రామారావు మాటల సందర్భంలో.

“తెలియదే” అంటూ ఆశ్చర్యపోయాడు విశ్వనాథం.

పరంధామయ్యకూడా వృత్తిరీత్యా వారి జాతికి చెందినవారే. ఎలిమెంటరీ స్కూల్ హెడ్మాస్టర్‌గా పనిచేసి విశ్వనాథం మాస్టారికంటే ఓ ఏడాది ముందే రిటైరయ్యారు. తర్వాత హైదరాబాద్‌లో ఉన్న కొడుకు దగ్గరకు వెళ్లిపోయా రాయన; ఒక్కగానొక్క కొడుకును విడిచి ఉండలేనన్న భార్యపోరు పడలేక. మిత్రుడు హైదరాబాద్‌లోనే వుంటున్నా డనుకుంటున్న విశ్వనాథం మాస్టారిగారి కది న్యూస్.

“అయితే పరం హైదరాబాద్ నుంచి ఎప్పుడు వచ్చేశాడు? ఇక్కడ కొన్నాళ్లుంటాడా, మళ్లీ కొడుకు దగ్గరకు వెళ్లిపోతాడా” అంటూ ప్రశ్నించారు.

“ఈ మధ్యనే వచ్చాడు. కోడలితో అతని భార్యకేవో మనస్పర్థలు వచ్చినట్టున్నాయి. ఇప్పట్లో కొడుకు దగ్గరకు తిరిగి వెళ్లరేమో!” అన్నారు రామారావు మాస్టారు.

“పరంని చూసి ఎన్నేళ్లో అయింది. ఓసారి చూసి రావాలి” అని విశ్వనాథం మాస్టారు అనడంతో “ఈ పూట ఇక్కడ పని పూర్తి చేసేసుకో. సాయంత్రం ద్రాక్షారామం వెళదాం. ఇటు మన పరాన్ని పలకరించినట్టు ఉంటుంది, అటు భీమేశ్వరుని దర్శించుకున్నట్టూ ఉంటుంది” అన్నారు రామారావు మాస్టారు.

ఆనందంతో వెంటనే ఒప్పుకున్నారు విశ్వనాథం మాస్టారు.

మిత్రులిద్దరూ ద్రాక్షారామం చేరుకునేసరికి చీకటి పడిపోయింది. ముందుగా ఆలయానికి వెళ్లి దైవదర్శనం చేసుకున్నారు. తరువాత పరంధామయ్యగా రింటికి చేరుకున్నారు.

మిత్రుల్ని చూసేసరికి పట్టరాని ఆనందం కలిగింది పరంధామయ్య మాస్టారికి. ఒకరినొకరు కౌగలించుకుని అవ్యక్తానందాన్ని పొందారు ముగ్గురూ.

“మన రామం అన్నా ఒకసారి కనిపించాడు గాని, నీ జాడే లేదు” అన్నారు పరంధామయ్య మాస్టారు.

“ఎన్నాళ్ల కెన్నాళ్లకు కలుసుకున్నాంరా, పరం! నాకెంతో ఆనందంగా ఉందిరా.” ఆనందం అణుచుకోలేకపోయారు విశ్వనాథం మాస్టారు.

పరామర్శలు అయ్యాక, “స్నానం చేయండ్రా, భోజనం చేద్దాం” అన్నారు పరంధామయ్య మిత్రులతో.

భార్యను పిలిచి, “కాంతం! అబ్బాయి స్నానమైపోతే వీళ్లక్కూడా నీళ్లు తోడు” అన్నారు.

విశ్వనాథం ఆశ్చర్యపోతూ, “చెప్పలేదేంరా, పరం? హైదరాబాద్‌నుంచి అబ్బాయి వచ్చాడా?” అనడిగాడు.

పరంధామయ్య నవ్వి, “మా వాసు కాదురా. కృష్ణమూర్తని...నా ఓల్డ్ స్టూడెంట్‌లే. అంబాజీపేటలో నా దగ్గర చదువుకున్నాడట. నే నిక్కడ ఉన్నానని తెలిసి వెతుక్కుంటూ వచ్చాడు” అన్నారు. ఆయన స్వరంలో కించిత్తు

గర్వం తొంగిచూసింది.

"అలాగా?" అన్నారు విశ్వనాథం మాస్టారు సంతోషంగా.

"రాజమండ్రిలో ఎల్‌ఐసీలో ఆఫీసరట. ఎంత అణకువ అనుకున్నావ్? ఆఫీసరునన్న అహం అణుమాత్రమైన లేదనుకో" అని వరంథామయ్యగారు చెబుతుంటే, "అతను నీ శిష్యుడు కదా!" అన్నారు రామారావు మాస్టారు.


దాంతో ముగ్గురూ హాయిగా నవ్వుకున్నారు.

కాసేపటికి అక్కడికి వచ్చాడు ఆ యువకుడు.

మిత్రులు అలా వాదించుకుంటుంటే ఆ యువకుడు తలవంచుకుని మౌనంగా ఉండిపోయాడు.

అది గమనించిన వరంథామయ్యగారు, "చూడవోయ్, కృష్ణమూర్తి! నిన్ను చూసి ఎవరో అనుకుని మావాళ్లు పొరబడుతున్నారు. నీ వివరాలు నీ నోటితోటే చెప్పి వాళ్ల నోళ్లు మూయించెయ్" అన్నారు నవ్వుతూ.

"ఔనోయ్...పొరపాటు పడుతున్నది వీళ్లో, నేనో నువ్వే తేల్చేయ్" అన్నారు విశ్వనాథం మాస్టారు.



అతన్ని చూడగానే, "సూర్యం! నువ్వా?" అన్నారు రామారావు మాస్టారు.

"అరె! ఇతను నీకు తెలుసా, రామూ?" అన్నారు వరంథామయ్యగారు.

"తెలీకపోవడ మేమిటి? పుల్లేటికుర్రులో ఎలిమెంటరీ స్కూల్లో నా దగ్గర చదువుకున్నాడు. ప్రస్తుతం ఏలూరులో కోపరేటివ్ బ్యాంకులో ఆఫీసర్‌గా పనిచేస్తున్నాడు. నేను కోటిపల్లిలో సెటిలయ్యానని తెలిసి నెలకిందట నన్ను చూడ్డానికని వెతుక్కుంటూ వచ్చాడు." గర్వంగా చెప్పుకున్నాడు రామారావు మాస్టారు.

"అబ్బే, నువ్వు పొరబడుతున్నట్టున్నావురా, రామూ! ఈ అబ్బాయి పేరు సూర్యం కాదు; నే నిందాక చెప్పిన కృష్ణమూర్తి ఇతనే" అన్నారు వరంథామయ్య మాస్టారు నవ్వుతూ.

"పొరపాటు నువ్వు పడుతున్నావేమోనని నా అనుమానం రా, వరం!" అన్నారు విశ్వనాథం మాస్టారు, ఆ యువకుడిని పరీక్షగా చూస్తూ.

"ఇతను నా ఓల్డ్ స్టూడెంట్ ప్రసాద్‌లా ఉన్నాడు. రాజోలులో నా దగ్గర చదువుకున్నాడు. ఇప్పుడు కాకినాడ స్టేట్ బ్యాంక్‌లో ఆఫీసరుగా పనిచేస్తున్నాడు."

"చెప్పవోయ్, సూర్యం! సందేహిస్తా వెందుకు?" అని రామారావు వంత పలికారు.

"మాస్టారూ!" మెల్లగా గొంతు విప్పాడు ఆ యువకుడు. "నన్ను క్షమిస్తానంటే...ఓ నిజం చెబుతాను..."

అప్రయత్నంగా ముఖాలు చూసుకున్నారు ముగ్గురు మిత్రులూ.

"మీరు భావిస్తున్నట్లు నేను ప్రసాద్‌నీ, సూర్యాన్నీ కాను; కృష్ణమూర్తిని అంతకంటె కాను. నేను రాజోలులోగాని, అంబాజీపేటలోగాని, పుల్లేటికుర్రులోగాని చదువుకోలేదు..."

"ఆఁ...!" తెల్లబోయారు ముగ్గురూ.

"అవును, మాస్టారూ, నేను మీ ఎవరిదగ్గరా చదువుకోలేదు. నా అసలు పేరు నారాయణరావు. నాది ముక్తేశ్వరం. డిగ్రీ పాసయ్యాను. కాని ఆ డిగ్రీ నాకు బతుకు తెరువును చూపించలేకపోయింది. ఎంత ప్రయత్నించినా ఓ చిన్న ఉద్యోగంకూడా సంపాదించలేక పోయాను. చివరికి మాడే పొట్టకోసం వంచన పంచకు చేరక తప్పలేదు..."

అయోమయంగా చూశారు ఆ పంతుళ్లు.

"...ఆకలి బాధకు తట్టుకోలేక ఈ కొత్త మార్గం అవలంబించాను, మాస్టారూ! అంతేకాని మిమ్మల్ని మోసగించాలని కాదు." చెప్పుకుపోయా డతను.

స్వరంలో జీర, గొంతులో దైన్యం, పలుకుల్లో అపరాధభావన ద్యోతక మవుతున్నాయి. "చుట్టుపక్కల ఊళ్లలోని ఉపాధ్యాయుల వివరాలు సేకరిస్తూంటాను. వారిలో వృద్ధుల్ని, ముఖ్యంగా రిటైరయిన వారిని ఎన్నుకుంటాను. వారి ఓల్డ్ స్టూడెంట్‌నని వంక పెట్టుకుని వారింటికి వెళ్లి పరిచయం చేసుకుంటాను. ఉపాధ్యాయుల స్వభావం నాకు తెలుసు. స్వతహాగా సాత్వికులు, కరుణామయులూను. అంతకుమించి అమాయకులు. తమ శిష్యులు ఉన్నత శిఖరాలను అందుకున్నారంటే సంతోషించడం మినహా ఇతరత్రా ఎరగని నిస్వార్థపరులు వారు. వారిలోని ఔదార్యాన్ని, బలహీనతలను ఆసరా చేసుకొని నా వంచన పథకాన్ని రూపొందించుకున్నాను. తన పాత శిష్యుడు బహుకాలానికి తనమీద అభిమానంతో చూడ్డానికొస్తే ఓ పూట భోజనం పెట్టకుండా పంపే ఉపాధ్యాయుడు ఎవ రుంటారు? ఆ విధంగా చుట్టుపక్కల ప్రాంతాలలోని మీ బోటి

## రాకేశ్ రోశన్ ఆందోళన!

'కహో నా ప్యార్ హై' చిత్రంతో అశేష ఉత్తరభారతాన్నీ ఓ ఊపు ఊపిన హృతిక్ రోశన్ తరువాత చేసిన చిత్రాలేవీ హిట్ కాకపోవటంతో, తండ్రి రాకేశ్ రోశన్‌కు చాలా దిగులుగా వుంది. అందుకనే ఇప్పుడు తను దర్శకత్వం వహిస్తున్న 'కోయీ మిల్ గయా' చిత్రం దాదాపు పూర్తయినా కూడా విడుదల చేయకుండా వున్నాట్ట. "ఇక పనైపోయింది" అనుకున్న ప్రతి సారీ, రాకేశ్‌కు చిత్రంలో ఏదో లోపం కనిపించి మళ్లీ షూట్ చేస్తున్నాట్ట. ఇట్లా చాలాసార్లు జరిగినా పాపం 'బేటా రోశన్' తండ్రిని ఏమీ అన్లేకపోతున్నాడు. ఎందుకంటే ఏదైనా అంటే తండ్రి అలిగి, మరో హీరోతో చిత్రం పూర్తి చేసేస్తాడేమోనని లోపల్లోపల 'ఇ'దుంది. అసలు కథేమిటంటే, వరసగా ఫ్లాపులు రావటంతో, రషెస్ చూసేందుకు కూడా బయ్యర్లు ఆసక్తి చూపటం లేదట. మరా తండ్రి తన పాట్లు తను పడుతున్నాడు!

ఎస్.

ఉపాధ్యాయులను మోసగించి ఓ పూట కడుపు నింపుకోవడం అలవర్చుకున్నాను...ఇదీ, మాస్టారూ, నేను చేసే పని! అంతకు మించి మరో దురుద్దేశ్యం లేదు నాకు."

హఠాత్తుగా చేతుల్లో ముఖం కప్పుకుని పసిపిల్లాడిలా దుఃఖించా డతను.

విభ్రాంతపోయిన ఆ మిత్రత్రయం తేరుకునేందుకు కొంతసమయం పట్టింది.

"ఎంత ఘోరంగా ఈ ముసలాళ్లను వంచించావయ్యా!" సగం స్వగతంగా అన్నారు పరంథామయ్య మాస్టారు బాధగా.

అంతకుమించి ఏమనాలో తోచలేదు ఎవరికీను. అతన్ని వారించాలనికూడా తోచలేదు.

"సారీ, మాస్టారూ, అయాం వెరీసారీ" అన్నా డతను. "అనుకోకుండా మీ ముగ్గురూ ఈ రోజిక్కడ కలిసుండకపోతే నా మోసం వెల్లడయ్యేది కాదు. నన్ను పోలీసులకు అప్పగించండి. నా చేతులకు సంకెళ్లు వేయించండి. మీరేమైనా చేయండి. కాని...నా దుస్థితిని అర్థం చేసుకోండి, మాస్టారూ! కేవలం పట్టెడు మెతుకుల కోసం అబద్ధాలు చెప్పానే తప్ప మీ డబ్బూ, నగలూ దోచుకోవాలని కాదన్న సత్యాన్ని గ్రహించండి. నా అపరాధాన్ని మన్నించండి" అంటూ వారి కాళ్లమీద పడ్డా డతను. అతని నేత్రాలనుంచి జాలువారిన కన్నీరు వారి పాదాలను అభిషేకం చేసింది.

అతన్ని లేవనెత్తారు విశ్వనాథం మాస్టారు. "బాధపడకయ్యా! నీ దైన్యస్థితి మాకు చక్కగానే అవగాహన అయింది. నువ్వు మా విద్యార్థివి కాకపోవచ్చును కాని, మావంటి మరో ఉపాధ్యాయుడికి శిష్యుడివే కదా!" అనునయంగా అన్నా రాయన. "సారీ చెప్పాల్సింది నువ్వు కాదయ్యా... కడుపు నింపడం నేర్పని విద్యా విధానాన్ని రూపొందించిన మన రాజకీయ నాయకులు! సిగ్గు పడవలసింది నువ్వు కాదు; మన వ్యవస్థ! లేకుంటే, దేశంలో ఎందరో పట్టభద్రుల జీవితాలు ఇలా ఎందుకుంటాయి?!... ఉపాధ్యాయుల మనస్తత్వాన్ని సరిగానే అంచనా వేశావు నువ్వు. అమాయకులూ, అల్ప సంతోషులునూ వాళ్లు. తాము ఎదగలేకపోయినా తమ శిష్యులు జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించారంటే సంతోషంలో తలమునకలు వేస్తారు. అందుకే నీ పలుకులలోని నిజానిజాలను బేరీజు వేసే ఆలోచనకూడా లేకుండా పోయింది మాకు. ఓ పూట నీ కడుపు నింపినందుకు మేము విచారించడం లేదయ్యా! విజ్ఞానం పెరిగేకొద్దీ నేటి విద్యావంతుల భవిష్యత్తు మరింత దుర్భర మవుతోందేమో అని బాధగా ఉంది. ఈ యువత ఏమవుతుందో అని భయంగా ఉంది."

"మాస్టారూ! ఇక ఎప్పుడూ, ఎవరినీ మోసగించనని వాగ్దానం చేస్తున్నాను. నన్ను క్షమించాననండి. నా దారిన నేను వెళ్లిపోతాను" అన్నా డతను.

"తప్పు ఒప్పుకున్నావు. నీ పొరపాటు గ్రహించావు. మరోసారి అటువంటి పని చేయనని హామీ కూడా ఇచ్చావు. అంతకంటే ఇంకేం కావాలోయ్? అయినా నువ్వేమంత అపరాధం చేశావని నిన్ను క్షమించడం?" అన్నారు రామారావు మాస్టారు ఓదార్పుగా.

"మీవి పెద్ద మనుసులు, మాస్టారూ! నాకు సెల విప్పించండి" అంటూ ట్రావెల్ బ్యాగ్ తీసుకుని భుజానికి తగిలించుకున్నా డతను.

పరంధామయ్య మాస్టారు చిరునవ్వుతో అతని భుజంమీద చేయి వేశారు. "అదేమిటోయ్, భోం చేయకుండా ఎలా వెళతావ్? ఇవాళ అనుకోకుండా నా పాతమిత్రులు కూడా కలిశారు. ఆ ఆనందంలో పాలు పంచుకోవాలని నీ కనిపించడం లేదూ?... మనసులో అనవసరపు శంకలు ఏమీ పెట్టుకోక బ్యాగ్ అక్కడ పెట్టు. ఈ రాత్రికి ఇక్కడే ఉండి తెల్లవారాక వెళుదువు గాని" అన్నారు.

"అది కాదు, మాస్టారు!" అంటూ అతనేదో చెప్పబోతే, "ఇకనేం చెప్పొద్దు నువ్వు. నోరు మెదిపావంటే బెంచ్ ఎక్కించేస్తాం, జాగ్రత్త!" అని పరంధామయ్య మాస్టారు అనడంతో, ఫక్కుమన్నారంతా.

ఆ యువకుడుకూడా నవ్వేశాడు, వారి ఉన్నత హృదయాలకు మదిలోనే సుమాంజలు లర్పిస్తూ.

అంతలో ఏదో జ్ఞప్తికి వచ్చినట్లు "చూడవోయ్! మా ఊళ్లో ట్యూషన్ మాస్టార్ల అవసరం చాలా ఉంది. బడికి వెళ్లి చదువుకోవడానికి వీలుకాని వాళ్లూ, బళ్లో చెప్పింది సరిగా తలకెక్కక ట్యూషన్ మీద ఆధారపడేవాళ్లూ ఎందరో ఉన్నారు. నువ్వు సరేనంటే అలాంటివారిని కొందరిని సమకూర్చగలను నేను. శ్రద్ధగా వారికి చదువు చెప్పుకున్నావంటే నువ్విక వెనక్కి తిరిగి చూసుకో నవసరం ఉండదు. ఏమంటావ్?" అన్నారు రామారావు మాస్టారు.

"అంతకంటేనా, మాస్టారూ!" అంటూ ఆనందంతో ఉక్కిరిబిక్కిరయ్యాడు ఆ యువకుడు. ■



## ఛాలెంజింగ్ పాత్రలు కావాలి!

తొలి చిత్రంలోనే అభిషేక్ బచ్చన్ సరసన-'శరారత్'-నటించిన ఘనత హృషితాభట్‌కే చెందుతుంది. ఆ చిత్రం హిట్ కాకపోయినా హృషితకు గుర్తింపు లభించింది. తరువాత 'అశోక, దిల్ విల్ ప్యార్ వ్యార్' చిత్రాల్లో నటించింది. "కొత్త దర్శకుల చిత్రాల్లోనే చేస్తుందన్న మాట నన్ను గురించి వినిపిస్తుంది. చిత్రం తీస్తున్నది కొత్త దర్శకులా, కాదా అనేది నేనాలోచించను. ఎవరైనా నాకిచ్చిన పాత్ర బాగుంటే ఓకే అంటాను. నా వయసుకు తగిన పాత్రలు, ఛాలెంజింగ్‌గా వున్నవి చేయా లనుంది. కామెడీ, లైట్‌గా వుండే పాత్రలు చెయ్యటమంటే ఇష్టం. ప్రస్తుతం 'హాసిల్, తేరే ప్యార్ కీ కసమ్, యాహూ' చిత్రాల్లో చేస్తున్నాను" అంటున్న హృషితకు, మోడల్ రంగం నుంచి ఇంకా అవకాశా లొస్తున్నాయట. మొదట్లో మోడల్‌గా వుండే బాలీవుడ్‌కు వచ్చింది. జీవితం పట్ల మనకున్న దృక్కోణాన్ని మార్చే వేదాంతపఠనం హృషితకు ఇష్టం.

ఎస్.